పబ్లిక్ రీడింగ్ రూములకు భవనాలేవి?

- కనీసం జీపీ కార్యాలయాల్లో ఏర్పాటు చేయలేని పరిస్థితి
- మండలంలో ఒక్కటైనా మంజూరు కాని వైనం
- అటకెక్కిన ప్రతిపాదనలు



పబ్లిక్ రీడింగ్ రూముకు ఎంపికై రద్దయిన ఊట్‌పెల్లి గ్రామపంచాయతీ కార్యాలయం

కథలాపూర్: ప్రతీ వ్యక్తికి జ్ఞానాన్ని అందించడం, పఠనాశక్తి, ఏకాగ్రత స్థాయి పెంచడంలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషిస్తాయి. గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు ఎంతో ఉపయోగపడుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలు లేకపోవడంతో పట్టణ ప్రాంతాలు, మండలకేంద్రాలకు పాఠకులు వెళ్లాల్సిన పరిస్థితి. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 'పబ్లిక్ రీడింగ్ రూం'లు పేరుతో గ్రామాలకు మినీ గ్రంథాలయాలు మంజూరు చేయగా.. వాటిని గ్రామపంచాయతీ కార్యాలయాల్లోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గ్రామపంచాయతీల్లో స్థలం లేదని చెప్పడంతో కథలాపూర్ మండలానికి ఒక్కటి మంజూరు కాకపోవడం బాధకరం.

ప్రభుత్వం అందించే సహకారం ఇదే..

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కొత్తగా పబ్లిక్ రీడింగ్ రూంలు ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిని జిల్లా గ్రంథాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఏర్పాటు చేసే భవనంలో వసతులు, ఫర్నీచర్ కోసం పరిస్థితులను బట్టి రూ. 2.50 లక్షల వరకు వెచ్చించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. ఒక్కో పబ్లిక్ రీడింగ్ రూం కోసం నెలకు రూ. 2 వేలు చొప్పున నిధులు కేటాయించగా.. రూ. 1,000తో పుస్తకాలు, న్యూస్ పేపర్లు కొనుగోలు చేయాలి. మరో రూ. 1,000 నిర్వహించేవారికి గౌరవ వేతనంగా ఇవ్వాలి. ఇందుకోసం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనే ప్రత్యేకంగా గది కేటాయించి రంగులు వేయించి ఫర్నీచర్‌ను సమకూర్చాలని అధికారులు ఆదేశించారు. ఇదంతా బాగానే ఉన్నా.. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో జూన్ 20న విద్యా దినోత్సవం రోజున ఆయా మండలాల్లో పబ్లిక్ రీడింగ్ రూములను ప్రారంభించాలని నిర్ణయించారు. కానీ కథలాపూర్ మండలంలో 19 గ్రామాలుండగా.. ఒక్క గ్రామానికి అవకాశం రాకపోవడం శోచనీయమని విద్యాభిమానులు అంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రంథాలయం ఉంటే చదువుకోవచ్చు



గ్రామాల్లో గ్రంథాలయం ఉంటే ఎప్పటికప్పుడు కొత్త పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. యువతకు, విద్యార్థులకు వీలైనప్పుడు చదువుకునే వీలుంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు పట్టణ ప్రాంతాలకు వెళ్లే భారం తప్పుతుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి పబ్లిక్ రీడింగ్ రూములు ఏర్పాటు చేయాలి.

– దొమ్మాటి అర్జున్, యువకుడు, సిరికొండ

ప్రతిపాదనలు పంపించాం



మండలంలో పబ్లిక్ రీడింగ్ రూముల ఏర్పాటుకు అనువుగా ఉండే గ్రామపంచాయతీలు, ఇతర భవనాలుంటే నివేదిక పంపాలని ఉన్నతాధికారులు అప్పట్లో ఉత్తర్వులు ఇచ్చారు. గ్రామాల వారీగా వివరాలు సేకరించి మండలంలోని ఆరు గ్రామాల్లో పబ్లిక్ రీడింగ్ రూములకు అనువుగా భవనాలున్నాయని అప్పట్లోనే నివేదిక పంపించాం.

– జనార్దన్, ఎంపీడీవో, కథలాపూర్

నిరుపయోగంగా గోపాలమిత్ర భవనం



ఎల్లాపూర్‌లో నిర్మించిన గోపాలమిత్ర భవనం

పెగడపల్లి: మండలంలోని ఎల్లాపూర్‌లో నిర్మించిన గోపాలమిత్ర భవనం వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. మండలంలో 23 గ్రామాలుండగా మండల కేంద్రంలోనే పశువైద్యశాల ఉంది. మండలంలో ఎక్కడ కూడా పశువైద్య ఉప కేంద్రాలు లేవు. దీంతో మారుమూల గ్రామాల పశువులకు సకాలంలో వైద్యం అందని ద్రాక్షగా మారింది. మారుమూల గ్రామాల రైతులు పశువులను తీసుకుని మండల కేంద్రంలో ఉన్న పశు వైద్యశాలకు వచ్చి పశువులకు చికిత్స చేయించడానికి ఇబ్బందులు పడుతున్నారు. మారుమూల ప్రాంతాల పశువులకు సకాలంలో పశు వైద్యం అందించాలని, మండలంలోని ఎల్లాపూర్‌లో రూ. 6 లక్షల నిధులతో గోపాలమిత్ర భవనం నిర్మించారు. కానీ నెలలు గడుస్తున్నా భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు పశు వైద్యాధికారులు చర్యలు తీసుకోకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ భవనాన్ని వినియోగంలోకి తెచ్చి గోపాలమిత్రను అందుబాటులో ఉంచి పశువులకు సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అంబరిపేటలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సభ్యులు

వెల్గటూర్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ బృందం సభ్యులు తెలిపారు. ఎండపల్లి మండలం అంబరిపేటలో మంగళవారం బృంద సభ్యులు పర్యటించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పరిశీలనలో భాగంగా 15 ఇళ్లను శాంపిల్‌గా తీసుకొని, వాటిలో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్వహణ, ఇంకుడుగుంత నిర్వహణపై బృంద సభ్యులు ఇంటి సభ్యులతో చర్చించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రంను సందర్శించి వసతులు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుర్గం లక్ష్మి, అడిషనల్ డీఆర్డీవో నరేష్, డీఎల్‌పీవో కనకదుర్గ, ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో అనిల్, ఏపీఎం చంద్రకళ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆండాళ్, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ హరిణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులు



ఎమ్మెల్యే, జెడ్పీ చైర్ పర్సన్ దంపతులు

జగిత్యాలజోన్: కలియుగ వైకుంఠం తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర స్వామిని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత దంపతులు, టీటీడీ బోర్డు మెంబర్, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దంపతులు మంగళవారం దర్శించుకున్నారు.

ఎఫ్‌టీఎల్‌ను పునర్నిర్మించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న చెర్లకొండాపూర్ గ్రామస్తులు

రాయికల్: పట్టణంలోని పెద్ద చెరువు మత్తడిని ఎఫ్‌టీఎల్ లెవల్‌లో పునర్నిర్మించాలని కోరుతూ మంగళవారం చెర్లకొండాపూర్ గ్రామానికి చెందిన రైతులు తహసీల్దార్ ఖయ్యూంకు వినతిపత్రం అందజేశారు. రాయికల్ పెద్ద చెరువు వద్ద ఉన్న ఎఫ్‌టీఎల్ లెవల్ ధ్వంసం చేయడంతో నీరంతా వృథాగా వాగులో కలుస్తోందని, దీంతో చెర్లకొండాపూర్ గ్రామ రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ధర్మపురి, పల్లికొండ రమేశ్, ఆకుల రాజేందర్, సురేశ్, నారాయణ, వెంకటి, భీమలింగం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందిస్తున్న సీఐ, ఎస్సై

మల్యాల: మండలంలోని పోతారం గ్రామానికి చెందిన పారుపల్లి రాజిరెడ్డి సుమారు రూ.25 వేల విలువైన తన మొబైల్ ఫోన్‌ను మూడు నెలల క్రితం పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్ యాప్‌తో సెల్‌ఫోన్ కనుగొని, మంగళవారం మల్యాల సీఐ కార్యాలయంలో సీఐ కోటేశ్వర్, ఎస్సై అశోక్ బాధితుడికి సెల్‌ఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

చిన్న మొక్కల స్థానంలో పెద్ద మొక్కలు నాటాలి



మొక్కలను పరిశీలిస్తున్న ఏపీడీ శివాజీ

ఇబ్రహీంపట్నం: సంపదవనంలో నాటిన చిన్న పండ్ల మొక్కల స్థానంలో పెద్దవి నాటాలని ఏపీడీ, మండల ప్రత్యేకాధికారి బాలే శివాజీ కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎస్సారెస్పీ క్యాంపు స్థలంలో సంపదవనంలో నాటిన పండ్ల మొక్కలను పరిశీలించారు. నాటిన మొక్కలకు సపోర్ట్‌గా కట్టెలను బిగించి కట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, ఇన్‌చార్జి ఏపీవో వినోద్, ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైశ్యులు

గొల్లపల్లి: ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలని మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ఆర్యవైశ్యులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ కట్కం భాస్కర్, ఎల్లంకి రమేశ్, భాస్కర్, రేణికుంట రాజేశం, సతీశ్, శ్రీను, పెంటయ్య, భాస్కర్, శ్రీను పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎల్జీగార్డెన్స్‌లో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా కార్యకర్తలు చూడాలని, పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఎల్లప్పుడూ ఆదరిస్తారన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండి కేసీఆర్ ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లైబ్రరి చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం చాలా గొప్పది

అన్నదానం చాలా గొప్పదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని లక్ష్మీగణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో గణేశ్ ఆలయంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, దేవాలయాలకు అధిక నిధులు కేటాయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, రాంచంద్రం పాల్గొన్నారు.

ఎస్సైగా ఎంపికైన యువకుడికి అభినందన

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన బాదినేని జగదీశ్ ఎస్సైకి ఎంపిక కాగా, మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జగదీశ్‌ను కలిసి అభినందించారు. ఆయన వెంట నాయకులు నీరటి గంగారెడ్డి, బక్కశెట్టి ఆంజనేయులు ఉన్నారు.

యువత చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

జగిత్యాలక్రైం: యువత చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని పట్టణ సీఐ నటేశ్ అన్నారు. సోమవారం అర్ధరాత్రి జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆపరేషన్ నైట్‌సేఫ్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. అర్ధరాత్రి వేళల్లో ప్రధాన కూడళ్లు, వీధులు, రోడ్లు, వాహనాలతో తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ మద్యం సేవించి రోడ్లపై ద్విచక్ర వాహనాలతో ర్యాష్ డ్రైవింగ్, హారన్లు కొడుతూ ప్రధాన కూడళ్లలో అనుమానస్పదంగా తిరుగుతున్న 15 మంది యువకులను అదుపులోకి తీసుకుని ఆరు వాహనాలను సీజ్ చేశారు. యువత చట్టవ్యతిరేకమైన పనుల్లో పాల్గొంటే వారు భవిష్యత్ కోల్పోతారని, తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అసాంఘీక కార్యకలాపాల నివారణే లక్ష్యంగా ఆపరేషన్ నైట్ సేఫ్టీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

గల్ఫ్ బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



ఆర్థికసాయం అందిస్తున్న మేడిపల్లి సత్యం

మల్యాల: ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన తరాల రాజ్‌కుమార్ గుండెపోటుతో మృతి చెందాడని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని మానాల గ్రామానికి చెందిన తరాల రాజ్‌కుమార్ ఈ నెల 4న దుబాయ్‌లో గుండెపోటుతో మృతిచెందగా, మంగళవారం మేడిపల్లి సత్యం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు అనంతరం గల్ఫ్ బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు రూ.10 లక్షలు ఇస్తామని ఉద్యమ సమయంలో కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కోసం గల్ఫ్ కార్మికులు జేఏసీగా ఏర్పడి, రాష్ట్ర సాధనలో భాగస్వాములయ్యారని, బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు తక్షణమే రూ.10 లక్షలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెల్మ లక్ష్మారెడ్డి, ఎడిపెల్లి రాజిరెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

'పద్మశాలీ యుద్ధ భేరి' పోస్టర్ ఆవిష్కరణ

కథలాపూర్: కోరుట్లలో ఈనెల 13న నిర్వహించే పద్మశాలీ యుద్ధభేరి వాల్‌పోస్టర్‌ను కథలాపూర్ పద్మశాలీ సంఘం భవనంలో మంగళవారం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కోరుట్లలో నిర్వహించే పద్మశాలీ యుద్ధభేరికి అధికసంఖ్యలో సంఘం సభ్యులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, మండలాధ్యక్షుడు గుండేటి సురేశ్, నాయకులు పాల్గొన్నారు.

పద్మశాలీల సభను విజయవంతం చేయాలి

గొల్లపల్లి: కోరుట్లలో ఆగస్టు 13న నిర్వహించే పద్మశాలీ యుద్ధభేరిని విజయవంతం చేయాలని పద్మశాలీ సేవ సంఘం ప్రధాన కార్యదర్శి అంకం భూమయ్య అన్నారు. గొల్లపల్లి మండల కేంద్రంతో పాటు, చందోలి, రంగదామునిపల్లి గ్రామాల్లో పద్మశాలీ యుద్ధభేరి గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అలిశెట్టి రవీందర్, చందోలి పద్మశాలి సేవ సంఘం అధ్యక్షుడు సత్తయ్య, రంగదామునిపల్లి అధ్యక్షుడు రమణ, కోశాధికారి తిరుపతి, వివిధ గ్రామాల పద్మశాలీ బంధువులు పాల్గొన్నారు.

చక్కెర పరిశ్రమ తెరిపించాలి

మల్లాపూర్ : చెరుకు రైతుల ప్రయోజనార్థం నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కుందారపు సాయికుమార్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రావణికి ఆయన మంగళవారం ఒక వినతిపత్రం అందజేశారు.

పోరుమల్లలో ఇంటింటా ఆరోగ్య సర్వే

కథలాపూర్: మేడిపెల్లి మండలం పోరుమల్ల, గుండ్లపల్లి గ్రామాల్లో చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటా ఆరోగ్య సర్వే నిర్వహించారు. రెండు గ్రామాల్లో 86 మంది వైద్యులు ఇంటింటా తిరిగి ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామని ఆస్పత్రి నిర్వాహకులు పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, వైద్యులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల గడువు పొడిగించాలి

మెట్‌పల్లి: ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల గడువును పొడిగించాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొనికెల నవీన్ మంగళవారం డిమాండ్ చేశారు. వైన్స్ దుకాణాల టెండర్‌కు పక్షం రోజుల గడువు ఇచ్చిన ప్రభుత్వం.. దరఖాస్తు చేసుకోవడానికి కేవలం నాలుగు రోజులు మాత్రమే ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో దరఖాస్తు చేసుకోవడానికి మరో పది రోజుల గడువును పొడగించాలన్నారు.

బీసీ కులవృత్తిదారులకు రూ. లక్ష ఆర్థికసాయం అందజేత

కథలాపూర్: బీసీ కులవృత్తిదారులకు ప్రభుత్వం అందించే రూ. 1 లక్ష సాయం కథలాపూర్, మేడిపెల్లి మండలాలవారికి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా సిరిసిల్లలో మంగళవారం అందించారు. కథలాపూర్ మండలానికి చెందిన 14 మందికి రూ. 1 లక్ష చొప్పున, మేడిపెల్లి మండలానికి చెందిన 14 మందికి రూ. 1 లక్ష చొప్పున చెక్కులు అందించారని ఎంపీడీవోలు జనార్దన్, వెంకటేశ్‌జాదవ్ తెలిపారు. ఈ రెండు మండలాల్లో 1,576 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా మహేశ్వర్‌రెడ్డి

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా మహేశ్వర్‌రెడ్డి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బాలఎల్లం ఖానాపూర్‌కు బదిలీ అయినట్లు తెలిసింది.

సంక్షిప్త వార్తలు

గృహలక్ష్మి పథకంపై అవగాహన కల్పించాలి

జగిత్యాలరూరల్: గ్రామాల్లో అర్హులైన నిరుపేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మించుకునేలా గృహలక్ష్మి పథకంపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో రాజేశ్వరి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గృహలక్ష్మి పథకం, స్వాతంత్ర్య వజ్రోత్సవాలు, హరితహారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీవో రవిబాబు, సూపరింటెండెంట్ గంగాధర్ పాల్గొన్నారు.

మండలంలో 29 గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు 119 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో రాజేశ్వరి తెలిపారు. అలాగే అర్బన్ మండలంలో ఐదు గ్రామపంచాయతీల్లో 14 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో శైలజరాణి తెలిపారు. అర్హులైన వారంతా ఈనెల 10 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దరఖాస్తులు పరిశీలన

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తుల స్వీకరణను మంగళవారం ఎంపీపీ జాజాల భీమేశ్వరి పరిశీలించారు. ఇప్పటి వరకు 174 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీపీ జాజాల భీమేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజాసేవ కోసమే నవీన్‌ను మీ చేతుల్లో పెడుతున్నా'

మల్లాపూర్: ప్రజా సేవ కోసమే తన కుమారుడు నవీన్‌ను మీ చేతుల్లో పెడుతున్నానని బీజేపీ సీనియర్ నాయకుడు, జేబీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సురభి భూంరావు అన్నారు. మంగళవారం మల్లాపూర్ రెడ్డి పంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రజలను, రైతులను మభ్యపెడుతుందని దుయ్యబట్టారు. నియోజకవర్గ ప్రజాసేవకు నా కుమారుడు సురభి నవీన్‌కుమార్‌ని మీ చేతుల్లో పెడుతున్నానని, నాపై ఉన్న ప్రేమాభిమానాలనే నవీన్‌పై ఉంచి ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో బీజేపీ నియోజకవర్గ నాయకుడు సురభి నవీన్‌కుమార్, మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణ, ఎంపీటీసీ గున్నాల శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బైన ప్రశాంత్, మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు, జిల్లా కార్యవర్గసభ్యుడు గడ్డం నవీన్‌రెడ్డి,నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

ధర్మపురి: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఓటు వినియోగంపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ఓటు ప్రాధాన్యతను వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు కోసం పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చెరుకు రాజన్న, ఉపాధ్యాయులు మల్లేశం, కవిత, సరిత పాల్గొన్నారు.

'ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి'

ధర్మపురి: ప్రజలకు మోస పూరిత ప్రకటనలు అందిస్తున్న ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రెంటం జగదీశ్ అన్నారు. ధర్మపురి పట్టణంలో మంగళవారం నిర్వహించిన అసెంబ్లీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగ సమస్య తీవ్రమైందని అన్నాడు. ప్రభుత్వ విధానాలపై ఈనెల 11న జిల్లా కలెక్టర్ల కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చింత అనిల్, నాయకులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ

కోరుట్ల రూరల్: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు స్థానిక బీఈడీ కళాశాలలో మంగళవారం ఇంగ్లిష్ బోధన, వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నోడల్ అధికారి నల్ల శంకర్, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు పెగడపల్లిలో మంత్రి ఈశ్వర్ పర్యటన

పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మంత్రి ఈశ్వర్ పర్యటించనున్నట్లు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు లోక మల్లారెడ్డి తెలిపారు. నామాపూర్, నందగిరి, రాజరాంపల్లి, మ్యాకవెంకయ్యపల్లి, కీచులాటపల్లి గ్రామాల్లో మంత్రి పర్యటించి పలు అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలు చేస్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని మంత్రి పర్యటన విజయవంతం చేయాలని కోరారు.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార సదస్సు

పెగడపల్లి: మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10న గురువారం గొల్లపల్లి సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ సమస్యల పరిష్కార సదస్సు నిర్వహించనున్నట్లు గొల్లపల్లి ఏడీఈ ఆపరేషన్ వరుణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. గొల్లపల్లి, పెగడపల్లి మండలాల విద్యుత్ వినియోగదారులు సదస్సుకు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

10న ఉచిత కంటి వైద్య శిబిరం

మల్యాల: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మల్యాల మండలం అడ్డరోడ్డులోని కొత్త సురేశ్ బంక్‌లో ఈ నెల 10న ఏర్పాటు చేస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొత్త సునీల్ తెలిపారు. కంటి చూపు లోపాలు ఉన్న వారిని పరీక్షించి, మోతెబిందు ఉన్నవారిని గుర్తించి, ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోగలరని కోరారు.

కిందనే కూర్చుంటాం..!



మార్కెట్ షెడ్డులో కిందనే అమ్మకాలు

బుగ్గారం: నియోజకవర్గ కేంద్రంలో రూ.నాలుగు కోట్ల వ్యయంతో నిర్మించి ఇటీవలే ప్రారంభించిన సమీకృత మార్కెట్‌లో వ్యాపారులు కిందనే కూర్చుని కూరగాయల అమ్మకాలు సాగిస్తున్నారు. కూరగాయలు అమ్ముకోవడానికి ప్రత్యేకంగా గద్దెలు ఏర్పాటు చేసి వ్యాపారులకు ఎండా,వాన నుంచి రక్షణ ఉండడానికి సౌకర్యంగా పెద్ద షెడ్డులను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ వ్యాపారులు తమకు కింద కూర్చుని అమ్మకాలు సాగించడమే సౌకర్యంగా ఉందని, గద్దెలు ఎత్తుగా ఉన్నాయని వాపోయారు. మున్సిపల్ అధికారులు ఎంత నచ్చజెప్పినా.. వ్యాపారులు గద్దెలపై కూరగాయల విక్రయానికి ఇష్టపడకుండా ఆరుబయటే విక్రయిస్తున్నారు.